నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
04.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

### గణాంక దినోత్సవం

ప్రపంచ గణాంకాల దినోత్సవం (వరల్డ్ స్టాటిస్టిక్స్ డే)ను అక్టోబర్ 20న నిర్వహించారు. 2010లో 41వ సెషన్‌లో యూఎన్ స్టాటిస్టికల్ కమిషన్ అక్టోబర్ 20న వరల్డ్ స్టాటిస్టిక్స్ డే నిర్వహించాలని ప్రతిపాదించారు. 2010లో మొదటి దినోత్సవం నిర్వహించగా 2015లో రెండో దినోత్సవం నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది దీని థీమ్ 'అలైన్‌మెంట్ ఆఫ్ స్టేట్ ఇండికేటర్ ఫ్రేమ్‌వర్క్ విత్ నేషనల్ ఇండికేటర్ ఫ్రేమ్ వర్క్ ఫర్ మానిటరింగ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్'. అదేవిధంగా అక్టోబర్ 20న వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డేని నిర్వహించారు. ఈ డేని 1996 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది దీని థీమ్ 'స్టెప్ అప్ ఫర్ బోన్ హెల్త్-బిల్డ్ బెటర్ బోన్స్'.

# కార్పొరేట్ల సుముఖత — ఉద్యోగుల విముఖత

**ఆటంబాంబు దాడి తర్వాత జపాన్ ప్రజలు అహోరాత్రులు శ్రమించి దేశాన్ని పునర్నిర్మించుకున్న తీరు ప్రపంచాన్ని ఎప్పుడూ అబ్బురపరుస్తూనే ఉంటుంది. కానీ ఉద్యోగ బాధ్యతల కారణంగా ఆ దేశంలో విపరీతంగా తగ్గుతున్న జననాలు, వివాహాల సంఖ్య, అత్యధికంగా ఉన్న ఆత్మహత్యలు నాణేనికి మరో పార్శ్వాన్ని చూపిస్తున్నాయి.**

## నారాయణమూర్తి మాటలపై దుమారం

- ఇటీవల ఆ దేశాన్ని ఉదాహరణగా చూపెడుతూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి భారత యువత వారానికి 70 గంటలు పని చేసినప్పుడే ఉత్పాదకత పెరిగి మనదేశం అగ్రరాజ్యాల సరసన చేరగలదని చేసిన హితోక్తి విమర్శల దుమారాన్ని లేపింది. కొందరు కార్పొరేట్ దిగ్గజాలు ఆయనకు మద్దతు పలకగా, మరికొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు.
- మొత్తానికి ఈ వివాదం ఒక తీగ అయితే దీని ద్వారా కదులుతున్న అనేక అంశాలు వివిధ సమస్యలను తెరపైకి తెస్తున్నాయి. ఆరోగ్యం, పని నాణ్యత, స్త్రీల కోణం, సామాజిక ప్రభావాలు, లాభాలు-వేతనాల మధ్య వ్యత్యాసం, పని పరిస్థితులు, మేధోవలసలు, అవ్యవస్థీకృత శ్రామిక రంగం వంటి అనేక అంశాలు చర్చకు వస్తున్నాయి.
- ఈ చర్యకు ప్రధాన కారణమైన పని గంటల విషయానికి వస్తే టైం యూజ్ సర్వే ప్రకారం మనదేశంలో వారానికి సగటున 61.6 గంటలు పని చేస్తున్నారని తెలుస్తుంది. రాష్ట్రాలవారీగా, గ్రామీణ-పట్టణ ప్రాంతాల వారీగా కూడా వ్యత్యాసాలున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ పని గంటలు ఉంటున్నాయి.
- దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూల్లో అత్యధికంగా 78.6 గంటలు, నాగాలాండ్‌లో అత్యల్పంగా 46.8 గంటలు వారానికి పని చేస్తున్నారు.
- అయితే ఇటీవల కర్ణాటక ప్రభుత్వం రోజుకు 12 గంటల వరకు పరిశ్రమల్లో పని చేయడానికి అనుమతిస్తూ కార్మిక చట్టాలను మార్చింది. అయితే ఈ 12 గంటల పని, వారం మొత్తం వర్తించదు. మొత్తంగా వారంలో పని గంటలు 48 గంటలకు మించరాదు. అంటే రోజుకు 12 గంటల లెక్కన 4 రోజులు వారంలో లేదా 8 గంటల చొప్పున 6 రోజులు పని చేయాలని ఉంది. అయితే ఈ చట్టం ప్రకారం ఓవర్ టైమ్ చేయడానికి పరిమితిని మూడు నెలల్లో 75 గంటల నుంచి 145 గంటలకు పెంచారు. అయితే ఈ చట్టం ఐటీ రంగానికి వర్తింపజేయకపోవడం విమర్శలకు కారణమైంది.
- ఇటువంటి చట్టాలు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరాఖండ్, పంజాబ్, గోవా, గుజరాత్, హర్యానా, అసోం వంటి రాష్ట్రాల్లో కూడా కొద్దిపాటి మార్పులతో అమల్లో ఉన్నాయి. అయితే 'ఫ్యాక్టరీల చట్టం 1948' ప్రకారం రోజుకు 9 నుంచి 10 గంటలు (వారానికి 48 గంటలు) ఓవర్‌టైమ్‌తో కలుపుకొంటే వారంలో 50-60 గంటలకు మించి పని చేయరాదు. ఈ పరిమితులకు లోబడి వివిధ రాష్ట్రాలు తమ గంటల్ని సర్దుబాటు చేసుకుంటున్నాయి.



## పనిగంటల పెంపుపై సమస్యలు - విమర్శలు



## గిగ్ సెక్టార్

- దేశంలో అత్యధిక ఉపాధిని కల్పిస్తున్న అవ్యవస్థీకృత రంగంలో ముఖ్యంగా గిగ్ సెక్టార్‌లో 12 గంటలకు పైన పనిచేస్తే గాని జీవన వ్యయాన్ని సంపాదించలేకపోతున్నారు. అంటే దేశంలో అత్యధిక శాతం మంది కార్మిక చట్టాల పరిమితిని మించి జీవన పోరాటం చేస్తున్నారు.
- ఐఎల్‌వో (అంతర్జాతీయ కార్మిక సంస్థ) ఇటీవల అంచనాల ప్రకారం అత్యధిక పని గంటలు గల దేశాల్లో భారత్ 5వ స్థానంలో ఉంది (ఈ జాబితాలో భారత్ కంటే గాంబియా, మంగోలియా, మాల్దీవ్స్, ఖతార్ ముందున్నాయి).
- ఆర్థికంగా ముందంజలో ఉన్న దేశాల్లో ఈ పని గంటలు వారానికి సగటున ఇజ్రాయెల్, బ్రిటన్‌లలో 36 గంటలు, అమెరికాలో 37 గంటలు, చైనాలో 46 గంటలు ఉన్నాయి.
- తులనాత్మకంగా పరిశీలిస్తే అత్యధిక సగటు పని గంటలున్న భారత్ ప్రపంచ తొలి 10 ఆర్థిక వ్యవస్థల్లో 'కనీస చట్టబద్ధ జీవన వేతన (Minimum Statutory Wage) పరంగా తలసరి జీడీపీ' పరంగా అత్యల్ప స్థానంలో ఉంది.
- శ్రామిక ఉత్పాదకత పరంగా కొవిడ్ ముందు నాటి (2019) లెక్కల ప్రకారం 'గంట'కు అమెరికాలో 73.70 డాలర్ల తలసరి ఉత్పాదకత, బ్రిటన్‌లో 54.35 డాలర్ల తలసరి ఉత్పాదకత, ఇజ్రాయెల్‌లో 48.87 డాలర్లు, చైనాలో 11.69 డాలర్లుగా ఉంది. అదే అన్నింటి కంటే ఎక్కువ పని గంటలు గల భారతదేశంలో గంటకు 8.68 డాలర్ల తలసరి ఉత్పాదకత ఉంది. ఈ దత్తాంశాన్ని పరిశీలిస్తే పని గంటలకు ఉత్పాదకతకు సంబంధం లేదని తెలుస్తుందని ఉద్ఘాటిస్తున్నారు.
- ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వ్యాఖ్యలు మరోసారి పని గంటలు- ఉత్పాదకత- సంపద పంపిణీ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది.
- ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత దేశంలో 60 శాతం సంపద 5 శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతం అయ్యింది. అట్టడుగు 50 శాతం ప్రజానీకానికి దక్కుతున్న దేశ సంపద కేవలం 3 శాతం మాత్రమే. ఈ విధంగా దేశంలో ఉన్న అత్యధిక పని గంటలు సృష్టిస్తున్న సంపద అతి తక్కువ మంది కార్పొరేట్ల చేతిలోకి వెళ్తుందని దేశంలో ఉత్పాదకత పెరగాలంటే దృష్టి పెట్టాల్సింది పని గంటలపై కాదని, పనికి తగ్గ వేతనాలు, సంపద వికేంద్రీకరణ, పని పరిస్థితుల్లో మెరుగుదల, సాంకేతిక అభివృద్ధి పై అని విశ్లేషకులు విశదీకరిస్తున్నారు.

**వారానికి 70 పని గంటల సాధ్యాసాధ్యాలపై కాకుండా పెద్ద ఎత్తున వివిధ కోణాల్లో విమర్శలు చెలరేగుతున్నాయి. అవి..**

## 70 గంటలపై విమర్శలు

**1** వారానికి 70 గంటలు పని చేయాలంటే సాధారణంగా ఐటీ రంగంలో ఉంటే వారంలో 5 రోజులు పని విధానంలో రోజుకు 14 గంటలు పని చేయాలి. ఇతరత్రా రంగాల్లో ఉంటే వారానికి 6 రోజుల పని విధానంలో రోజుకు సుమారు 12 గంటలు పని చేయాల్సి ఉంటుంది. అంటే ఒక మనిషికి ఉన్న 24 గంటల్లో 8 గంటలు నిద్ర, 14 లేదా 12 గంటలు పనికి పోను మిగిలిన 2 లేదా 4 గంటల్లో కాలకృత్యాలు, ఇతరత్రా దైనందిన గృహ కార్యక్రమాలు, కార్యాలయానికి రాకపోకల సమయం అనేవి సర్దుబాటు చేసుకోవడం సాధ్యమయ్యే పనికాదు.

**2** ఉద్యోగినుల విషయానికి వస్తే వారు ఉద్యోగ, గృహ కార్యకలాపాలకు కలిపి వారంలో 70 గంటల కంటే ఎక్కువే పని చేస్తున్నారు. ఇక 14 లేదా 12 గంటలు ఉద్యోగ సమయమే ఉంటే వారి ఆరోగ్యం, కుటుంబం, పిల్లల పెంపకాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికీ వారు చేస్తున్న అదనపు పనికి సమాజంలో కుటుంబంలో తగిన గుర్తింపు లేదని స్త్రీ వాదులు వాపోతున్నారు.

**3** 7 గంటల పని విధానాన్ని వైద్యులు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 70 గంటలు పని అమల్లోకి వస్తే వ్యక్తిగత విశ్రాంతి, మానసిక ఉల్లాసం, వ్యాయామానికి సమయం లేక అనేక జీవన శైలి వ్యాధులతో పాటు, కుంగుబాటు, హార్మోనుల అసమతుల్యత, గుండెపోటులు వంటి దుష్పరిణామాలు మరింత పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు.

**4** ఒక వ్యక్తి సరైన విశ్రాంతి, కుటుంబ సమయం, వినోదం లేకుండా యాంత్రికంగా పని చేయాల్సినప్పుడు చేసే పనిలో కూడా నాణ్యత, సృజనాత్మకత ఉండదు.

**5** అన్ని రంగాల వారికి సుదీర్ఘ పని గంటలు నచ్చదు. ఉదాహరణకు ఒక ఉపాధ్యాయుడు రోజుకు 12 గంటలు బోధించగలడా? లేదా ఒక వైద్యుడు అన్ని గంటలు ఏకాగ్రతతో, శారీరక సమన్వయంతో శస్త్ర చికిత్సలు చేయగలడా? సృజనాత్మకతతో కూడా రచన, పరిశోధన, సమస్యాపరిష్కారం వంటి పనులు సుదీర్ఘ పని గంటల వల్ల నాణ్యతను ఇవ్వగలవా?

**6** పిల్లలకు సరైన నాణ్యమైన సమయం (క్వాలిటీ టైమ్) తల్లిదండ్రులు ఇవ్వనప్పుడు వారి విద్య, మానసిక పరిణితి, ఆరోగ్యం వంటి వాటిపై దుష్ప్రభావాలు తీవ్రస్థాయిలో ఉండగలవు. తద్వారా దేశానికి లభించే తర్వాతి తరాలు ఏ మేరకు నైపుణ్యం గల సమర్థ మానవ వనరులుగా దక్కగలవు. అంతేకాకుండా వృద్ధుల సంరక్షణ, వారి ఒంటరితనం తదితర సమస్యలూ పెరిగిపోతాయి.

**7** 70 గంటల పనిని సమర్థిస్తున్న సజ్జన్ జిందాల్ (జేఎస్‌డబ్ల్యూ గ్రూప్), భవిష్ అగర్వాల్ (ఓలా సహ వ్యవస్థాపకుడు) కార్పొరేట్ దిగ్గజాలే వీరు.

ఉదాహరణలుగా చూపెడుతున్న ఎలాన్ మస్క్ వంటి వారందరూ కూడా బిలియనీర్లే. వారికి సకల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఏ ఒక్క గృహ కార్యకలాపాలు, తమ సొంత పనులు సైతం తాము నిర్వహించుకోనవసరం ఉండదు. అన్నింటికీ మించి తమ పనిగంటల వల్ల లభించే అన్ని రకాల లాభాలు (ఆర్జన, హోదాపరమైన, వారసులకు సంపద బదిలీ మొదలైనవి) పొందేది కూడా వారే. అందువల్ల పని చేయడానికి ప్రేరణ సహజంగానే వారికి వస్తుంది. వారి తరహాలో, వారి సంస్థల్లో, వారి కోసం పని చేసే సాధారణ ఉద్యోగులకు ఏ మేరకు ప్రయోజనాలు లభిస్తాయి. వారు ఒక పక్క తమ కుటుంబ, వ్యక్తిగత వ్యవహారాలు నిర్వహించుకుంటూ అత్యధిక పని గంటలు ఎవరి కోసం, ఏ ప్రేరణతో పని చేయగలరు.

**8** నిజానికి ఉత్పాదకత పెరగడం వల్ల లాభం ఎవరికి వస్తుంది? దేశ జీడీపీ పెరగడం వల్ల ఉత్పాదకత పెంచినా సామాన్యుడికి ఏ మేరకు భాగం లభిస్తుంది.

**9** పని గంటలు పెంచి దేశ ఉత్పాదకతను పెంచమంటున్న కార్పొరేట్ వర్గాలు సంపద వికేంద్రీకరణ, పరిశ్రమల యాజమాన్యాల్లో కార్మికుల భాగస్వామ్యం, పనికి తగ్గ వేతనాలు, లాభాల్లో వాటా, పని పరిస్థితులపై మాట్లాడకపోవడం దేశ ఉత్పాదకతకు దోహదం చేసే అసలు కారణాలను విస్మరించడం కాదా. 'మూన్ లైటింగ్' విధానంతో తమ ఆదాయం పెంచుకోవడానికి ఉద్యోగులు అధిక పని గంటలు పని చేయడాన్ని నిరసిస్తూ కఠిన వైఖరి అవలంబిస్తున్న కార్పొరేట్ సంస్థలు దాన్ని దేశ ఉత్పాదకత పెంపు కోణంలో చూడలేకపోవడం వారి ద్వంద్వ ప్రమాణాలు కావా.

**10** దేశంలో ఉన్న ఈ ద్వంద్వ ప్రమాణాలు, అత్యధిక పని గంటలకు అత్యల్ప ఆదాయం వంటివి మేధో వలసలకు ప్రధాన కారణంగా ఉన్నాయి. నైపుణ్యం గల మానవ వనరులపై ఉత్పాదకత, అభివృద్ధి ఆధారపడి ఉంటాయని అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మిగతా 6వ పేజీలో..**

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

